అభివృద్ధిలో రాజకీయాలకు తావులేదు



ఇందిరాపార్కులో వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

కవాడిగూడ: నగరంలోనే ప్రసిద్ధి గాంచిన ఇందిరాపార్కును రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. జంటనగరాలు నుంచి అనేక ప్రాంతాల నుంచి ఉదయం సాయం కాలం సమయాల్లో పార్కుకు సందర్శకులతో పాటు వాకర్స్ అధిక సంఖ్యలో వస్తున్నారని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గతంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఫిర్యాదు మేరకు ఓపెన్ జిమ్‌లకు లక్షలాది రూపాయలు వెచ్చించి మరమ్మతులు చేయించామన్నారు.

కనీస సౌకర్యాలపై..

పార్కులో కనీస సౌకర్యాల కల్పనకు వివిధ శాఖల అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. సోమవారం ఇందిరాపార్కులో పార్కు డైరెక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ డైరెక్టర్ రాజ్‌కుమార్, పార్కు మేనేజర్ భాస్కర్, సూపర్‌వైజర్ మౌనికలతో కలిసి ఎమ్మెల్యే పార్కును సందర్శించారు. పార్కులో సందర్శకులు, వాకర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇందిరా పార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎ. సుధాకర్‌యాదవ్, సభ్యులు ప్రభాకర్ యాదవ్, శ్రీనివాస్‌ముదిరాజ్, టీకేఎంరెడ్డిలు మాట్లాడుతూ... ఇందిరాపార్కులో కుక్కల బెడద ఉందని, తాగునీటి సమస్య శానిటేషన్ సమస్య, టాయిలెట్స్ శుభ్రతపై ఎమ్మెల్యే ముఠాగోపాల్ పార్కుకు వచ్చిన అధికారులకు సమస్యను వివరించామన్నారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారన్నారు. బీజేపీ నాయకుడు వెంకటేష్, స్థానిక నేతలున్నారు.

డబ్ల్యూటీఓ నుంచి భారత్ బయటికి రావాలి

– పలు వామపక్ష ప్రజా సంఘాల డిమాండ్



ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) నుంచి భారతదేశం బయటికి రావాలని డిమాండ్ చేస్తూ.. సంయుక్త కిసాన్ మోర్చా, ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ, ఏఐటీయూసీ తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్‌మోర్చా తెలంగాణ కన్వీనర్ సాగర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని విదేశీ కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు పూనుకుందని విమర్శించారు. ఫిబ్రవరి 26న అబుదాబీలో డబ్ల్యూటీఓ కాన్ఫరెన్స్ ప్రారంభం కానుందని ఆ కాన్ఫరెన్స్‌లోనే భారతదేశం తప్పుకుంటున్నట్లు చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుల పోరాటంపై నిర్బంధానికి వ్యతిరేకంగా దేశమంతటా రైతులను చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. వివిధ సంఘాల ప్రతినిధులు ప్రభాకర్, ఆర్.వెంకటరాములు, జక్కుల వెంకటయ్య, కార్మిక సంఘం నాయకులు భూపాల్, ఎస్.ఎల్.పద్మ, శ్రీనివాస్, అరుణ, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలోనే నిజమైన సంతృప్తి



కాచిగూడ: సామాజిక సేవలోనే నిజమైన సంతృప్తి ఉంటుందని తెలంగాణ గోశాల ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ అన్నారు. తెలంగాణ గోశాల ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం వనవాసీ కళ్యాణ పరిషత్ శ్రీ మల్లికార్జున విద్యార్థి వసతి గృహానికి వంట సామగ్రిని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎంత సంపాదించినా రాని ఆనందం పేదరికంలో మగ్గుతున్న వారికి చేయూతనందించడంలో ఉంటుందన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు చేయడానికి ప్రతి ఒక్కరూ తమవంతు సహాయ, సహకారాలు అందించాలని కోరారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేలా కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. హిందూ ధర్మం, భారతదేశ సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పన్ కోశాధికారి ప్రేమ్‌చంద్ మునోద్, వీహెచ్‌పీ సామాజిక సామరసత అభియాన్ ప్రాంత ప్రముఖ్ దామోదర్ శెట్టి, వనవాసి కళ్యాణ్ పరిషత్ ప్రతినిధి గట్టు అశోక్‌రెడ్డి, మనోహర్, రాజు, భక్తరామ్ తదితరులు పాల్గొన్నారు.




సావర్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

స్వాతంత్ర్య పోరాటంలో సావర్కర్ పాత్ర మరువలేనిది

కాచిగూడ: దేశ స్వాతంత్ర్య పోరాటంలో వీర సావర్కర్ పాత్ర మరువలేనిదని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. వీర సావర్కర్ వర్ధంతి సందర్భంగా సోమవారం కాచిగూడ చౌరస్తాలోని వీర సావర్కర్ విగ్రహానికి కేంద్రమంత్రి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన మహనీయుల్లో వినాయక్ దామోదర వీర సావర్కర్ ముఖ్యుడని ప్రశంసించారు. దేశ స్వాతంత్ర్యం కోసం సావర్కర్ చేసిన కృషి మరువలేనిదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, బీజేపీ నేతలు ఎ.సూర్యప్రకాష్ సింగ్, వినోద్‌యాదవ్, శ్యామ్‌రాజ్, కె.రమేష్‌యాదవ్, భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, సుభాష్ పటేల్, రవీందర్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ చైతన్యంతోనే అధికారం కైవసం



మాట్లాడుతున్న కోవూరు భాస్కర్ రావు

కాచిగూడ: దేశవ్యాప్తంగా ఉన్న బీసీల్లో రాజకీయ చైతన్యం కల్పించి, అధికారాన్ని కైవసం చేసుకునేందుకు బీసీలందరూ.. సంఘటితం కావాలని తెలంగాణ బీసీ సాధికారత సంఘం అధ్యక్షుడు కోవూరు భాస్కర్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం నారాయణగూడలో సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య, ఆర్.వి.మహేందర్‌కుమార్, జెల్లపల్లి వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే తెలంగాణ రాష్ట్ర బీసీ మంత్రులు, ప్రజా ప్రతినిధులకు అభినందన సత్కార కార్యక్రమంతో పాటు జాతీయ స్థాయిలో బీసీ సదస్సును నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న బీసీ కుల సంఘాల ప్రతినిధులు, రెండు తెలుగు రాష్ట్రాల్లో నుంచి బీసీలు అధిక సంఖ్యలో పాల్గొంటారని వివరించారు. ముఖ్యఅతిథులుగా తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తదితరులు పాల్గొంటారని ప్రకటించారు.

కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టారని అందులో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ ఒకటని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సోమవారం హిమాయత్‌నగర్ మండల తహశీల్దార్ కార్యాలయంలో 51 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను నీరుగార్చకుండా పేదలకు అందించాలని కోరారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక సీట్లు కై వసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. డిప్యూటీ తహశీల్దార్ రఘు, యువజన నాయకులు ముఠా జైసింహ, కార్పొరేటర్ రచనశ్రీ, ముచ్చకుర్తి ప్రభాకర్, రాంనగర్ డివిజన్ అధ్యక్షులు రావుల మోజెస్, గాంధీనగర్ అధ్యక్షులు రాకేష్‌కుమార్, అడిక్‌మెట్ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, కూరగాయల శ్రీను పాల్గొన్నారు.

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం



ముషీరాబాద్: ప్రతిరోజు వ్యాయామం చేస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. సోమవారం ముషీరాబాద్ డివిజన్ వైఎస్ఆర్ పార్కు వద్ద గల జీహెచ్ఎంసీ మినీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సౌజన్యంతో ప్రముఖ ఇంటర్నేషనల్ ఫ్యాషన్ డిజైనర్ శిల్పారెడ్డి సహకారంతో రూ.10 లక్షల విలువ చేసే జిమ్ పరికరాలను అందజేశారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, డివిజన్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్, ఫ్యాషన్ డిజైనర్ శిల్పారెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువత క్రీడలు, వ్యాయామంపై దృష్టిసారించాలని సూచించారు. రోజు వ్యాయామం చేయడం వల్ల మానసిక రుగ్మతుల దూరం అవుతాయన్నారు. కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్, ఇంటర్నేషనల్ ఫ్యాషన్ డిజైనర్ శిల్పారెడ్డి మాట్లాడుతూ.. మహిళలు తప్పనిసరిగా వ్యాయామం చేయాలని సూచించారు. తద్వారా వారు ఆరోగ్యంగా ఉండడంతో పాటు ఇంటిల్లిపాది సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. ఎస్ఆర్డీ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మీడియా సెల్ ఇన్‌చార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్, క్రీడాకారులు సీ.హెచ్.వీరారెడ్డి, బొల్లం శ్రీనివాస్, కాలనీ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, నాయకులు ఎం.ఎన్.చారి, సోమేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా స్ట్రాబెర్రి ఫిల్డ్స్ వార్షికోత్సవ వేడుకలు



వార్షికోత్సవ వేడుకల్లో చిన్నారులతో ప్రముఖ క్లాసికల్ సింగర్ మాలవిక ఆనంద్

కాచిగూడ: బర్కత్‌పురలోని స్ట్రాబెర్రి ఫిల్డ్స్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులు ఆడిపాడి అందరిని అలరించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ క్లాసికల్ సింగర్ మాలవిక ఆనంద్ పాల్గొని సీనియర్ కేసీ విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. విద్యార్థులు మంచిగా చదువుకుని జీవితంలో ఉన్నతంగా ఎదగడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆమె కోరారు. స్కూల్ టీచర్స్, చిన్నారులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

చిక్కడపల్లి: పోస్టల్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని కేంద్రప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం చిక్కడపల్లి పీఅండ్‌టీ కాలనీలోని యూనియన్ కార్యాలయంలో ఆలిండియా ఎంఎంఎస్ ఎంప్లాయిస్ యూనియన్ ఎంజీ,ఎంటీఎస్ గ్రూప్ హైదరాబాద్ సార్టింగ్ డివిజన్ బ్రాంచ్ ద్వైవార్షిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సురేష్ మాట్లాడుతూ.. ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్నే పునరుద్ధరించాలని వివరించారు. తపాలా శాఖను ప్రైవేటీకరించే చర్యలు తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. హైదరాబాద్ సార్టింగ్ డివిజన్ రీజనల్ కార్యదర్శి సీఎస్ నాయుడు, యూనియన్ నాయకులు ముక్తార్ అహ్మద్, జలాలుద్దీన్ పాల్గొన్నారు.

'జీవన విపంచి' నవల ఆవిష్కరణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: జీవన విపంచి ఎంతో గొప్ప నవల అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రముఖ రచయిత్రి పీవీఎస్.కృష్ణకుమారి రచించిన జీవన విపంచి నవల ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ప్రముఖ రచయిత్రి అత్తలూరి విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ సినీగేయరచయిత, సాహితీవేత్త డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ, కాలువ మల్లయ్య విశిష్ట అతిథి, ఆత్మీయ అతిథిగా మంథా భానుమతి హాజరయ్యారు. గంటి భానుమతి, అల్లూరి గౌరీలక్ష్మి, దుర్గ, మృణాళిని పాల్గొన్నారు.

వర్సిటీల్లో అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శరత్‌నాయక్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సోమవారం వినతి పత్రం అందించారు. ఓయూ సదస్సుకు విచ్చేసిన మంత్రికి వర్సిటీల పరిస్థితులను వివరించి గత ప్రభుత్వం రిక్రూట్‌మెంట్ బోర్డు పేరుమీద ఉద్యోగాలను భర్తీ చేయకుండ నిర్లక్ష్యం చేసిందని తెలిపారు. అధ్యాపకుల కొరతతో బోధన, పరిశోధన పూర్తిగా కుంటుపడిందని పేర్కొన్నారు. అలాగే ఫెలోషిప్ ఇవ్వాలని, మెస్ బకాయిలు రద్దు చేయాలని, పీహెచ్‌డీ విద్యార్థులకు నెలకు రూ.30 వేల ఫెలోషిప్ ఇవ్వాలని దళిత, వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు మంత్రికి వేర్వేరుగా వినతి పత్రాలు సమర్పించారు.

రామకృష్ణారెడ్డి మరణం ఉద్యమాలకు తీరని లోటు



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రజా పక్షపాతి, విప్లవ శ్రేయోభిలాషి అరికట్ల రామకృష్ణారెడ్డి మరణం ఉద్యమాలకు తీరని లోటని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కల్యాణ మండపంలో పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ పి.సంధ్య భర్త, నవ్య ప్రింటర్స్ అధినేత రామకృష్ణారెడ్డి(ఆర్‌కేఆర్) సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా హైకోర్టు మాజీ న్యాయమూర్తి చంద్రకుమార్, సీపీఐ జాతీయ కన్వీనర్ నారాయణ, చాడా వెంకట్‌రెడ్డి కె.గోవర్ధన్, మానవ హక్కుల వేదిక నాయకులు జీవన్‌కుమార్, ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు ఆర్‌కేఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 'మేము ప్రేమించే చందమామా.. మా ఆర్‌కేఆర్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాలు చేసిన వారు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. అలాంటి మంచి పనులు చేసినవారిలో ఆర్‌కేఆర్ ఒకరని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమకారులపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ.. ప్రజా ఉద్యమాలకు వెన్నుదన్నుగా ఉన్న వ్యక్తి రామకృష్ణారెడ్డి అని పేర్కొన్నారు. ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటన్నారు. సభకు అధ్యక్షత వహించిన సీపీఐఎంఎల్ న్యూడెమాక్రసీ కార్యదర్శి సాదినేని వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. రామకృష్ణారెడ్డి విప్లవ సంఘాల సభలు, సమావేశాలకు ఆర్థిక సహకారం అందించడంతో పాటు తన ప్రింటింగ్ ప్రెస్ ద్వారా ఉచితంగా కరపత్రాలు ముద్రించారని తెలిపారు. పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య, వారి కుమారుడు నవరంగ్, ఎస్‌యూసీఐ నాయకులు మురహరి, ఐఎఫ్‌టీయూ నాయకులు శ్రీనివాస్, అనురాధ, వివిధ సంఘాల నాయకులు సజయ, రవిచంద్ర, కొండవీటి సత్యవతి, నారగోని రవి, ప్రసాదన్న, ఎన్.వేణుగోపాల్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



రెడ్డి ఉమెన్స్ కాలేజ్ వార్షికోత్సవ వేడుకల్లో డాక్టర్ సౌమ్య మిశ్రా


కాచిగూడ: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్యమిశ్రా ఐపీఎస్ అన్నారు. రాజా బహదూర్ వెంకటరామారెడ్డి ఉమెన్స్ కాలేజ్ వార్షికోత్సవ వేడుకలు సోమవారం నారాయణగూడలోని కళాశాల ఆడిటోరియంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి డాక్టర్ సౌమ్య మిశ్రా ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించాలంటే లక్ష్యాన్ని ఎంచుకుని ప్రణాళికా బద్ధంగా కష్టపడి చదివినప్పుడే ఆ లక్ష్యాన్ని చేరడం సాధ్యమవుతుందన్నారు. ఒక ఆలోచన జీవితాన్నే మార్చివేస్తుందని విద్యార్థులు తమ ఉన్నత భవిష్యత్తు గురించి ఎంతో ఆలోచించాలని సూచించారు. విద్యార్థులకు అకాడమిక్ ఎక్సలెన్స్ అవార్డులను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.అచ్యుత దేవి, వైస్ ప్రిన్సిపాల్ కవిత పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్‌లోని ఫ్రెండ్స్ కాలనీ నూతన కమిటీ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. కాలనీ వాసులంతా ఐక్యంగా ఏర్పడి కాలనీ అధ్యక్షుడిగా కృష్ణాగౌడ్, ప్రధాన కార్యదర్శిగా అచ్చుత్‌రామయ్య, ఉపాధ్యక్షులుగా గంగారాం, ముత్యాలుతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. వీరంతా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పూస గోరక్‌నాథ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువజన కమిటి సీనియర్ నాయకులు ముఠా జైసింహలను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కమిటీ నాయకులను వారు ఘనంగా సన్మానించారు. కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

అంతర్గత రోడ్ల సుందరీకరణకు చర్యలు



మలక్‌పేట: ప్రధాన రహదారులతో పాటు డివిజన్‌లోని అంతర్గత రోడ్లను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్ రెడ్డి అన్నారు. శాలివాహననగర్‌లో రూ.15 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సకాలంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, కాలనీవాసులు అశోక్, నందు, బీజేపీ నాయకులు సురేందర్, కొప్పుల దినేశ్, నరేందర్, సంతోశ్, సందీప్ తదితరులున్నారు.

సౌండ్ హీలింగ్‌తో ఒత్తిడి దూరం



ఇన్‌స్ట్రూమెంట్స్‌తో సౌండ్ హీలర్ కావ్య బాగ్ చాందని

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సౌండ్ హీలింగ్‌తో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా చేయొచ్చని సౌండ్ హీలర్ కావ్య బాగ్‌చాందని తెలిపారు. సోమవారం అంబేడ్కర్ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు సౌండ్ హీలింగ్ థెరపిపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సౌండ్ హీలింగ్ ద్వారా ఒత్తిడిని జయించి మానసికంగా, ఉల్లాసంగా ఉండొచ్చని వివరించారు. ఇన్‌స్ట్రూమెంట్‌ను ఉపయోగించి ఒత్తిడి నివారణకు రిథమ్‌ఆఫ్ మ్యూజిక్ థెరపి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మ్యూజిక్ థెరపీతో ఒత్తిడి తట్టుకుని ఉపశమనం పొందొచ్చని సూచించారు. కళాశాల నిర్వాహకులు గడ్డం రోషిణి, ప్రిన్సిపాల్ ముదిగొండ భవానీ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలి



ఉచిత డ్రైవింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: యువత ఉపాధి, ఉద్యోగ శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్‌జీ అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని ఎలైట్ డ్రైవింగ్ స్కూల్ ఆధ్వర్యంలో, కేశవ స్మృతి సంవర్ధన సమితి సహకారంతో ఉచిత డ్రైవింగ్ స్కూల్ 8వ బ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా లింగం శ్రీధర్‌జీ మాట్లాడుతూ.. ఈ ఉచిత డ్రైవింగ్ స్కూల్ ద్వారా ఏడు బ్రాంచీలు పూర్తి చేసి 160 మంది యువతకు శిక్షణనిచ్చి ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం స్ఫూర్తి దాయకమన్నారు. ఎలైట్ డ్రైవింగ్ స్కూల్ అధినేత కె.ఉపేందర్, వివిధ సంస్థల ప్రతినిధులు డీ.ఎస్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన తైక్వాండో క్రీడాకారులు



ముషీరాబాద్: తైక్వాండో అకాడమీ చైర్మన్, ఉస్మానియా యూనివర్సిటీ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ బాబూలాల్ ఆధ్వర్యంలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా బాబూలాల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్రీడాకారులకు కావాల్సిన సౌకర్యాలను కల్పించాలని కోరారు. తైక్వాండో సీనియర్ కోచ్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అప్రకటిత ఎమర్జెన్సీని ధైర్యంగా ఎదుర్కోవాలి

– ప్రొఫెసర్ నిరంజన్‌ఆరాధ్య



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భారతదేశంలోని అప్రకటిత ఎమర్జెన్సీని ధైర్యంగా ఎదుర్కోవాలని ప్రొఫెసర్ నిరంజన్ ఆరాధ్య అన్నారు. రాజ్యం విద్యావ్యవస్థకు దూరంగా ఉండాలి కానీ విద్య వ్యవస్థల్లోకి చొరబడి ఆ విద్యను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భారత్ బచావో అఖిల భారత విద్యార్థుల సదస్సు ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ నిరంజన్ ఆరాధ్య మాట్లాడుతూ.. మన రాజ్యాంగాన్ని నాశనం చేసే రాజకీయ చక్రంలో ఉన్నామన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం విద్యను కాషాయికరణ చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ రాంపునియా, భారత్ బచావో ప్రతినిధులు గాదె ఇన్నయ్య, డాక్టర్ ఎం.ఎఫ్.గోపినాథ్, జంజర్ల రమేష్‌బాబు, సిద్ధార్థ్, సుజ్జిత్, సుశీల్ తదితరులు పాల్గొన్నారు.

సర్ సి.వి.రామన్ అవార్డు ప్రదానం

కాచిగూడ: జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్రం నుంచి ఒక్కరికి మాత్రమే ఇచ్చే సర్ సివి రామన్ అవార్డు –2024కు డాక్టర్ సీహెచ్ వేంకటేశ్వర్లుయాదవ్‌ను ఎంపిక చేసినట్లు తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణముదిరాజ్ తెలిపారు. ఈనెల 28న సైన్స్ డే సందర్భంగా జ్ఞాన భారతి మోడల్ హైస్కూల్‌లో జరిగే కార్యక్రమంలో వెంకటేశ్వర్లు యాదవ్‌కు ఈ అవార్డును ప్రదానం చేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



చిక్కడపల్లి: సబర్మతినగర్ బస్తీలో సీవరేజి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ తెలిపారు. సోమవారం బస్తీవాసులు చేసిన ఫిర్యాదుతో స్పందించిన ఆమె తక్షణమే వాటర్‌బోర్డు మేనేజర్ కృష్ణమోహన్‌తో సంప్రదించి సీవరేజి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. కార్పొరేటర్ సూచనల మేరకు నగర బీజేవైఎం మాజీ అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్ తదితర బీజేపీ, బీజేవైఎం నాయకులు వాటర్‌బోర్డు సిబ్బంది వెంట ఉండి సబ్మరతినగర్ బస్తీలో నిండిపోయిన డ్రైనేజీ లైన్‌ను శుభ్రం చేయించారు. బీజేపీ, బీజేవైఎం నేతలు, స్థానికులు రహమత్‌అలీ, కుమార్, నర్సింగ్‌రావు, యాదగిరి, చందు, సలీమ్, జగన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220383